www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 15 అక్టోబర్ 2024

5

ఏలూరు

వర్షాల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తం

ఎస్ఇ పి.సాల్మన్‌రాజు - ఏలూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఏలూరు : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఆ శాఖ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకుగాను ఏలూరులోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 9440902926 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని, 24 గంటలపాటు ఈ కంట్రోల్ రూమ్ పని చేస్తుందని తెలిపారు. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ వైర్లను, తడిసిన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ వైర్లపై తెగిపడిన చెట్ల కొమ్మలను ప్రజలు నేరుగా తాకొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యుత్ అంతరాయం లేదా సమస్య తలెత్తినచో దగ్గరలో గల విద్యుత్ సెక్షన్ ఆఫీసునకుగాని, టోల్ ఫ్రీ నంబరు 1912కుగాని ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

మద్యం 'జాతర'..!

అట్టహాసంగా మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ

ఉదయం 8 గంటలకు ప్రారంభమై 4 గంటలకు ముగింపు

144 మద్యం దుకాణాలకు 5,449 దరఖాస్తులు

లాటరీ ప్రక్రియ పూర్తి చేసి దుకాణాల కేటాయింపు

లైసెన్స్ ఫీజు కింద మొదటి విడతగా రూ.15.21 కోట్లు ఆదాయం

రేపటి నుంచి అమల్లోకి నూతన మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ సోమవారం జాతరలా సాగింది. వేలాది మంది దరఖాస్తుదారులు, రోడ్డు పొడవునా కార్లు, భారీ పోలీస్ బందోబస్తు, స్క్రీన్ల ఏర్పాటు, డబ్బు లెక్కింపునకు కౌంటింగ్ మిషన్లతో అట్టహాసంగా ప్రక్రియ నడిచింది. ఉదయం ఎనిమిది గంటలకు ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్‌లో కలెక్టర్ వెట్రిసెల్వీ మద్యం షాపుల లాటరీ ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 144 మద్యం దుకాణాలకు ఈ నెల 12తో దరఖాస్తుల స్వీకరణ ముగిసేసరికి మొత్తం 5,499 దరఖాస్తులు వచ్చాయి. సరాసరిన 144 దుకాణాలకు 38 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల నుంచి నాన్ రిఫండబుల్ ఫండ్ కింద ప్రభుత్వానికి రూ.109.98 కోట్లు ఆదాయం సమకూరింది. 14వ తేదీ సోమవారం లాటరీ ప్రక్రియ నిర్వహించి 144 మద్యం దుకాణాలను లైసెన్స్‌దారులకు అప్పగించారు. ప్రతి దుకాణానికి దాఖలైన దరఖాస్తులకు నెంబర్లు కేటాయించారు. ఆయా దుకాణాల లాటరీ ప్రక్రియ నిర్వహించేటప్పుడు అంతేసంఖ్య నెంబర్లు గల కాయిన్లు డబ్బాలో వేసి లాటరీ తీశారు. ఏ నెంబర్ కాయిన్ వస్తే ఆ నెంబర్ కేటాయించిన దరఖాస్తుదారునికి దుకాణం దక్కినట్లుగా ప్రకటించారు. ఒక్కో మద్యం దుకాణానికి అదనంగా ఇద్దరు రిజర్వుడు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఒకవేళ లాటరీలో ఎంపికైన వ్యక్తి సమయానికి డబ్బులు చెల్లించకపోయినా, వేరే ఇతర కారణాలు చోటుచేసుకున్నా అతనికి లైసెన్స్ రద్దు చేసి రిజర్వుడులో ఉన్న రెండో అభ్యర్థికి దుకాణం కేటాయిస్తారు. రెండో వ్యక్తికీ ఏమైనా సమస్యలు ఉంటే రిజర్వుడ్‌గా ఉంచిన మరో వ్యక్తికి దుకాణం కేటాయిస్తారు. దుకాణం దక్కించుకున్న వ్యక్తులు రిజిస్టర్‌లో సంతకం చేసి, ఆ తర్వాత చలానా తీసుకుని మొత్తం లైసెన్స్ ఫీజులో ఆరో వంతు చెల్లించారు. రూ.65 లక్షల లైసెన్స్ ఫీజు ఉన్న దుకాణాలను దక్కించుకున్నవారు మొదటి విడత లైసెన్స్ ఫీజు కింద రూ.10.83 లక్షలు, రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజు గల దుకాణం దక్కించుకున్న వారు లైసెన్స్ ఫీజు కింద రూ.9.16 లక్షలు చెల్లించారు. తొలివిడతగా లైసెన్స్ ఫీజు కింద మొత్తం రూ.15.21 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. లైసెన్స్ ఫీజును నగదు రూపంలోనూ, ఎస్‌బిఐ చెక్కుల రూపంలోనూ స్వీకరించారు. లైసెన్స్ ఫీజు కట్టించుకునే కేబిన్ల వద్ద కౌంటింగ్ మిషన్లు సైతం ఏర్పాటు చేయడంతో ప్రక్రియ వేగవంతంగా సాగింది. మొత్తం ప్రక్రియను వీడియో చిత్రీకరించారు.

లాటరీ తీసిన ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

నగదు లెక్కిస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా లాటరీ ప్రక్రియ

మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఎటువంటి ఘర్షణలూ చోటుచేసుకోలేదు. ఎక్సైజ్ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడే పెద్దసంఖ్యలో పోలీసులను మోహరించారు. లాటరీ నిర్వహిస్తున్న చలసాని గార్డెన్స్‌కు చాలాదూరంలో వాహనాలను దూరంగా నిలిపివేశారు. అక్కడనుంచి దరఖాస్తుదారులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి తరలించారు. గేటుముందు బారికేడ్లు ఏర్పాటు చేసి దరఖాస్తు చేసుకున్న వివరాల కాపీ, ఆధార్‌కార్డు పరిశీలించి మాత్రమే లోపలికి అనుమతించారు. గార్డెన్స్ ఆవరణలో పెద్దఎత్తున టెంట్లు ఏర్పాటు చేసి అందరూ అక్కడ కూర్చునేలా ఏర్పాటు చేశారు. లోపల జరుగుతున్న లాటరీ ప్రక్రియను అందరూ తిలకించేలా స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. ఏ షాపునకు లాటరీ నిర్వహిస్తున్నారో ఆ దరఖాస్తుదారులందరినీ మైక్‌లో ప్రకటించి ప్రత్యేక హాలులో కూర్చోబెట్టారు. లాటరీ నిర్వాహకులు దుకాణాదారులను లోపలికి అనుమతించేవారు. అత్యంత పకడ్బందీగా లాటరీ ప్రక్రియ నిర్వహించడంతో వేగవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య, అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఇన్‌చార్జి డిఆర్ఒ దేవకీదేవి, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డిఎస్‌పి శ్రవణ్‌కుమార్, జడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిఎస్ఒ ఆర్ఎస్ఎస్.రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్, తహశీల్దార్ శేషగిరి, ఎక్సైజ్ సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు బోల్తా: ఒకరు మృతి

మరో 17 మందికి గాయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

మరికొద్ది సేపట్లో గమ్యం చేరుకుంటాం.. ఈలోపు చింతలపూడిలో దిగాల్సిన వాళ్ల తమ బ్యాగ్‌లన్నీ తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఈలోపు బస్సు అటుఇటు ఊగినట్లయ్యి ఒక్కసారిగా బోల్తా పడింది. ప్రాణభయంతో ప్రయాణికుల అరుపులు, కేకలతో ఘటనా స్థలం దద్దరిల్లింది. ఈ ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున చింతలపూడి మండలం డిఎన్.రావుపేట, పోతునూరు మధ్యలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎపిఎస్‌ఆర్‌టిసి సూపర్ లగ్జరీ బస్సు 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌లోని జీడిమెట్ల నుండి ఏలూరు ఆదివారం రాత్రి బయల్దేరింది. ఈ బస్సు సోమవారం తెల్లవారుజామున చింతలపూడి మండలంలోని డిఎన్‌రావుపేట, పోతునూరు మధ్యలోకొచ్చేసరికి ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రయాణికుల కేకలు వేయడంతో అదే సమయానికి అటువైపుగా వెళ్తున్న ప్రయివేట్ బస్సు సిబ్బంది, ప్రయాణికులు ఆర్‌టిసి బస్సు వెనుక భాగం అద్దం పగులగొట్టి ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. గాయపడిన ప్రయాణికులను చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. 18 మందికి గాయాలవ్వగా ఏలూరుకు చెందిన పెందుర్తి విమలబాయ్ (60) ఎడమ చేయి తెగి పడటంతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగానే మార్గమధ్యంలో మృత్యువాత పడింది. మిగిలిన 17 మందిలో ఆరుగురిని మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సులో ఆరుగురు చిన్నారులు ఉండగా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

జెరూసలేం వెళ్లొస్తూ మృత్యుఒడికి..

చింతలపూడి ప్రభుత్వం జూనియర్ కాలేజీ గరల్స్ హాస్టల్ వార్డెన్ పెందుర్తి స్వర్ణలత తన ఇద్దరు అక్కా చెల్లెళ్ళు, తల్లి పెందుర్తి విమలబాయ్‌తో కలిసి జెరూసలేం వెళ్లారు. అక్కడ నుంచి హైదరాబాద్ చేరుకుని ఆర్‌టిసి బస్సులో స్వస్థలాలకు బయల్దేరారు. ఈ బస్సు ప్రమాదంలో విమలబాయ్ మృతి చెందగా అక్కాచెల్లెళ్ల ముగ్గురికీ గాయాలయ్యాయి. తమ కళ్లముందే తల్లి చనిపోవడంతో వారు రోదిస్తున్న తీరు అందరినీ కలిచి వేసింది. సంఘటనా స్థలాన్ని చింతలపూడి సిఐ రవీంద్ర, ఎస్ఐ కుటుంబరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బస్సులో సాంకేతిక లోపంతో స్టీరింగ్ పట్టేయడం, అతి వేగం ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

మృతి చెందిన విమలబాయ్

ఎంఎల్ఎ రోషన్‌కుమార్ పరామర్శ

బస్సు ప్రమాదంలో గాయాల పాలైన వారిని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పరామర్శించారు. మృతురాలి కుటుంబంతోపాటు క్షతగాత్రులను ఆదుకుంటామని తెలిపారు. సకాలంలో క్షతగాత్రులకు చికిత్స అందించిన వైద్య సిబ్బందిని, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండ్రు దేవాను ఎంఎల్ఎ అభినందించారు.

హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎఒకు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎపి యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ పరిపాలనాధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్, కార్యదర్శి టి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలు గత ఐదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. హెల్త్ సెక్రటరీల సీనియారిటీ లిస్టు వెంటనే ప్రకటించాలని, ఎంపీహెచ్ఎ(ఎఫ్) ఉద్యోగోన్నతులు కల్పించాలని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నీలాదేవి, విజయ కుమారి ఉన్నారు.

వినతి అందిస్తున్న హెల్త్ సెక్రటరీలు

డిసెంబర్ 13,14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో సిపిఎం 26వ జిల్లా మహాసభ

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

పోలవరం నిర్వాసితులు, భూసమస్యలే ప్రధానం

జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సిపిఎం ఏలూరు జిల్లా 26వ మహాసభ డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో జరగనున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. సిపిఎం జిల్లా మహాసభ సన్నాహక సమావేశం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ 35 ఏళ్ల ఏజెన్సీ భూఉద్యమ నేపథ్యంలో మొదటిసారి భూపోరాట కేంద్రమైన బుట్టాయగూడెంలో జిల్లా మహాసభ జరగడం శుభపరిణామం అన్నారు. సుదీర్ఘ భూఉద్యమం జరిగి వేల ఎకరాలు గిరిజనులు సాగు చేస్తున్నారని. భూఉద్యమ చరిత్ర ప్రజలందరికీ తెలిసేలా ఈ మహాసభ జరగనుందన్నారు. ఈ మహాసభ ఉమ్మడి జిల్లా పూర్వ కార్యదర్శి, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) స్మారక ప్రాంగణంలో జరగనున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక పాలసీ అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పునరావాసం, పరిహారం ఇవ్వడంలో లేదని విమర్శించారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వడంతోపాటు వివాదాలు లేని భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికీ పోలవరం నిర్వాసితులు, పునరావాసం, మరో వైపు జల్లేరు రిజర్వాయర్ నిర్మాణంతో ఏజెన్సీ భూభాగం కోల్పోతున్నామన్నారు. ప్రాజెక్టులు నిర్మాణంతో భూమి కోల్పోతుంటే జీలుగుమిల్లి మండలంలో మూడు పంచాయతీల పరిధిలో ఆయుధ కర్మాగారం నిర్మాణానికి గత ప్రభుత్వం ప్రయత్నించిందని, ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ అక్కడ నిర్మాణ పనులు చాప కింద నీరులా చేస్తుందని విమర్శించారు. ఏజెన్సీ భూసమస్యతో పాటు నిర్వాసితుల సమస్యలు, జిల్లాలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. అనంతరం జిల్లా మహాసభ ఆహ్వాన సంఘం కమిటీని ప్రకటించి, లోగోను ఆవిష్కరించారు. ఈ జిల్లా మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా పోలోజు నాగేశ్వరరావు, కార్యదర్శిగా తెల్లం రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా తామా ముత్యాలమ్మ, అందుగుల ఫ్రాన్సిస్, పి.మంగరాజు, కోర్స జలపాలు, ఉడతా వెంకటేష్ కోశాధికారిగా మొడియం నాగమణి, కారం భాస్కర్, కమిటీ సభ్యులుగా మండల కమిటీ సభ్యులు ఉంటారని ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, వై.నాగేంద్రరావు, తామా ముత్యాలమ్మ, ఎ.ఫ్రాన్సిస్, నాయకులు ఎస్.రాంబాబు, మురళి, ఎస్.బుల్లెమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, నరేంద్ర పోశమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభ లోగో ఆవిష్కరిస్తున్న నేతలు

'పల్లె పండుగ' ద్వారా రూ.4,500 అభివృద్ధి పనులు

గ్రామాలాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు

పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులను గ్రామాల్లో చేపడుతున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. పోతురెడ్డిపాలెంలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి పార్థసారధి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామాభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమనే పూజ్య బాపూజీ ఆశయాల మేరకు గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించి, పల్లెసీమలను ప్రగతి సీమలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ఆయా గ్రామాలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకుని, వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పల్లె పండుగ పంచాయతీల వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని 547 గ్రామ పంచాయతీల్లో 1,917 పనులను రూ.121.57 కోట్ల అంచనాతో ఉపాధి హామీ చట్టం పనులను చేపట్టామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తొలుత సీసీ రోడ్లు, డ్రెయిన్లు వంటి పనులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజా అవసరాలకు తగిన విధంగా మిగిలిన పనులు కూడా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. రానున్న వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఓగిరాల తండా గ్రామంలో, వెంకటాయపాలెంలో, మిట్టగూడెం, పడమర దిగవల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇఇ బాపురెడ్డి, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారధి

ఇక ఏరులై పారనున్న మద్యం..!

ప్రశాంతంగా ముగిసిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ

ప్రక్రియను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ నాగరాణి

ఆశ, నిరాశల నడుమ ఉత్కంఠభరితంగా సాగిన లాటరీ

16 నుంచి జిల్లాలో 175 ప్రయివేటు మద్యం షాపులు ప్రారంభం

5627 దరఖాస్తుదారుల నుంచి రూ.112.54 కోట్ల ఆదాయం

ఆరో వంతు లైసెన్స్ ఫీజు ద్వారా మరో రూ.19.20 కోట్లు

లాటరీలో షాపులు పొందిన లబ్ధిదారుల కేరింతలు

ప్రజాశక్తి - భీమవరం/కాళ్ల

జిల్లావ్యాప్తంగా ఈ నెల 16 నుంచి ప్రయివేటు మద్యం ఏరులై పారనుంది. మందుబాబులకు తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందుబాటులోకి రానుంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించిన సంగతి తెలిసిందే. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నూతన మద్యం పాలసీ అమలుకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జిల్లాలో 175 ప్రయివేటు మద్యం దుకాణాలకు సుమారు 5,627 దరఖాస్తులు వచ్చాయి. మద్యం దుకాణాల కేటాయింపునకు పెదఅమిరంలోని నిర్మలా ఫంక్షన్ హాల్‌లో సోమవారం లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. అయితే దరఖాస్తుదారులు ఉదయం ఆరు గంటలకే నిర్మల ఫంక్షన్ హాలుకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. స్థానిక ఫంక్షన్ హాలు ఆర్చ్ వద్ద ఒక చెక్‌పోస్టును, హాలు సమీపాన మరో చెక్‌పోస్టును అధికారులు ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులు అప్లికేషన్ ఫారం, ఎంట్రీ లేదా గేట్ పాస్ తీసుకొస్తేనే హాల్లోకి అనుమతించారు. ఒకవేళ దరఖాస్తుదారుడు హాజరుకాని పక్షంలో వారి స్థానంలో వేరొకరు హాజరైతే పాన్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు, రేషన్‌కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్‌గాని ఏదోకటి నకలు తీసుకుని అనుమతించారు. ఏదైనా గుర్తింపు కార్డు ఉంటేనే లోపలికి అనుమతించారు. లేనిపక్షంలో అక్కడ నుంచి వెనుదిరిగి పంపించి వేశారు. ఈ నేపథ్యంలో అనేకమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉత్కంఠభరితంగా సాగిన లాటరీ ప్రక్రియ

మద్యం షాపుల లాటరీ ప్రక్రియ అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. ఉదయం 8 గంటలకే లాటరీ ప్రక్రియను ప్రారంభించారు. ప్రతి గెజిట్ నెంబర్ పరిధిలో ఒక షాపునకు మూడు నెంబర్లు చొప్పున లాటరీ తీశారు. మొదటిగా వచ్చిన నంబర్ దరఖాస్తుదారుడిని విజేతగా ప్రకటించి మిగిలిన రెండు, మూడు నెంబర్ల దరఖాస్తుదారులను రిజర్వుగా ప్రకటించారు. లాటరీలో షాపు దక్కిన దరఖాస్తుదారులు ఆనందంలో మునిగి తేలారు. షాపు దక్కని దరఖాస్తుదారులు నిరాశతో వెనుదిరిగారు. 175 మద్యం దుకాణాల లాటరీలను జిల్లా కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా తీశారు. మధ్యాహ్నం 1.50 గంటలకు లాటరీ ప్రక్రియ ముగిసింది.

రూ.131.84 కోట్ల ఆదాయం

జిల్లాలో 175 మద్యం షాపులకు రూ.131 కోట్ల 89 లక్షలు ఆదాయం లభించింది. 5627 దరఖాస్తుల రూపంలో ఒక్కో దరఖాస్తుకు రూ.రెండు లక్షలు చొప్పున రూ.112 కోట్ల 54 లక్షలు ఆదాయం లభించింది. అలాగే లాటరీ పద్ధతి ద్వారా కేటాయించిన 175 మద్యం షాపులకు లైసెన్సు ఫీజు రూపంలో మొదటి వంతుగా రూ.19.20 కోట్ల ఆదాయం లభించింది. ఎస్‌బిఐ ఆధ్వర్యాన కౌంటర్ ఏర్పాటుతో షాపు దక్కిన లబ్ధిదారులు నగదు రూపేణా లేదా ఆన్‌లైన్ పద్ధతిలో సొమ్ము చెల్లించారు.

మామాఅల్లుళ్లకు జాక్‌పాట్

మద్యం షాపుల లాటరీలో మేనమామ చిక్కాల జగదీష్ ప్రసాద్, మేనల్లుడు చరణ్‌కు జాక్‌పాట్ తగిలింది. వీరిరువురు మరి కొంతమంది కలిసి ఆకివీడు స్టేషన్ పరిధిలో మద్యం షాపులకు 150 దరఖాస్తులు చేశారు. దీనిలో భాగంగా నిర్వహించిన లాటరీలో మూడు షాపులు జగదీష్ ప్రసాద్‌కు, మరో ఐదు షాపులు చరణ్‌కు దక్కాయి. ఈ నేపథ్యంలో అక్కడున్నవారంతా అవాక్కయ్యారు. లాటరీ తీసిన జిల్లా కలెక్టర్ నాగరాణి సైతం ఆశ్చర్యం వ్యక్తం చేసి అధికారులను షాపుల కేటాయింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే మామా అల్లుళ్లకు పెద్దసంఖ్యలో దుకాణాలు దక్కడం చర్చనీయాంశమైంది.

అనుకున్నదొక్కటి... అయిందొక్కటి..!

నిరాశలో సిండికేట్ వ్యాపారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మద్యం దుకాణాలకు సోమవారం ఏలూరులో నిర్వహించిన లక్కీ డ్రాలో సిండికేట్ వ్యాపారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అనుకున్నదొక్కటి. అయిందొక్కటి అన్న చందంగా డ్రా ఫలితాలతో వ్యాపారులు నిర్వేదానికి గురవ్వగా వ్యక్తిగతంగా టెండర్లు వేసిన వారికి డ్రా తగలడం గమనార్హం. ఉంగుటూరు మండలంలో మొత్తం ఏడు మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా 283 మంది టెండర్లు వేశారు. ఒక్కో దుకాణానికి రూ.రెండు లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజుతో ప్రభుత్వానికి రూ.5.66 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా ఈ మండలంలో 70వ నెంబర్ దుకాణం వై.శ్రీనివాసరావు, 71కి వై.ప్రసాద్, 72కి పి.రాంబాబు, 73కి ఎం.వెంకటేశ్వరావు, 74కి వి.పెద్దిరాజు, 75కి సుబ్రహ్మణ్యం, 76కి ఎం.అనిల్‌కు దక్కాయి. సిండికేట్‌గా 21 దుకాణాలకు 210 మంది టెండర్లు వేయగా వారికి రెండు దుకాణాలే డ్రాలో తగలడంతో సిండికేట్లు తీవ్రంగా నష్టపోయినట్లు చెబుతున్నారు.

ఏదాడికి రూ.52 కోట్ల టర్నోవర్

రూ.10.40 కోట్ల లాభాలు

ఉంగుటూరు-2, నారాయణపురం, చేబ్రోలు, గొల్లగూడెం, బాదంపూడి, కైకరం మద్యం దుకాణాల్లో ఇప్పటివరకు ఏడాదికి సుమారుగా రూ.52 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ప్రతి నెలా దుకాణాల వారు సరుకు కోసం కట్టే డీడీ చలానాలే రుజువు చేస్తున్నాయి. ఈ లెక్కన ఈ టర్నోవర్‌పై కనీసం 20 శాతం మార్జిన్ లాభం లెక్కేసుకుంటే రూ. 10.40 కోట్ల లాభాలు వ్యాపారులకు కాసులు కురిపించనున్నాయి. అందుకే ఏడు దుకాణాలకు 283 మంది టెండర్లు వేయటానికి కారణంగా తెలుస్తోంది. సిండికేట్ వ్యాపారులు నియోజకవర్గంలో 21 దుకాణాలకు 210 పైగా దరఖాస్తులు వేశారు. వారిలో రెండు దుకాణాలే డ్రాలో తగలడంతో రూ.కోట్లాది సొమ్ము పెట్టినా అనుకున్న స్థాయిలో దుకాణాలు తగలకపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయినట్లు ఆవేదన చెందుతున్నారు.

ఏలూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రస్తుతం వాతావరణం ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా రానున్న రోజుల్లో ఏర్పడే భారీ వర్షాల దృష్ట్యా ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు సహాయం నిమిత్తం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. ప్రజలు ఏదైనా సహాయ సహకారాలు పొందాలంటే 08812-232101, 08812-222200 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.ఎనిమిది లక్షలు కేటాయించడంతో ఎంపిపి గంజిమాల రామారావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. డ్రెయినేజీ నిర్మాణం పూర్తయితే గ్రామంలో పారిశుధ్య సమస్యలు తీరుతాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాబూరావు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు సర్పంచి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ఎంపిడిఒగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును ప్రగడపల్లి సర్పంచి కలుం బాపిరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీనివాసరావుకు సర్పంచి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పశువులను రోడ్లపై వదిలితే చర్యలు

ఏలూరు సిటీ :ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పశువులను, ఆవులను, ఎద్దులను రోడ్లపై విడిచిపెట్టవద్దని పశువుల యజమానులకు పలుమార్లు నోటీసులు జారీ చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారు తమ పశువులను రోడ్లపై విడిచి పెట్టడం వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేసేందుకు అవగాహన కల్పించామని తెలిపారు. అయినప్పటికీ పశువుల యజమానులు వారి వైఖరి మార్చుకోకపోవడంతో ఆ పశువులను గోసంరక్షణ సమితిలకు తరలిస్తామని, అదేవిధంగా వీధి పశువుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పశువుల తరలింపునకు అయ్యే ఖర్చును, పోషణకు అయ్యే ఖర్చును యజమానుల దగ్గర నుంచి ఆంధ్రప్రదేశ్ యాక్ట్ 1871 ప్రకారం వసూలు చేస్తామని పేర్కొన్నారు.

కొత్త పట్టిసీమలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో దసరా నవరాత్రి ఉత్సవాలు సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో ఘనంగా ముగిశాయి. అమ్మవారి ఊరేగింపును డిజె సౌండ్, నక్కపల్లి బ్యాండ్‌లతో అంగరంగ వైభవంగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, బాలాజీ, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'జనసేనకు పెరుగుతున్న ఆదరణ'

ఏలూరు సిటీ :ఏలూరు నియోజకవర్గంలో జనసేన పార్టీకి రోజురోజుకు ప్రజల నుంచి ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. నాగవంశ సంక్షేమ సంఘం ఏలూరు నాయకులు సుమారు 150 మంది ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రావణ్ కుమార్, జిల్లా సెక్రటరీ వెంకట్రావు, ఏలూరు సంఘ అధ్యక్షులు సత్యనారాయణ, ఏలూరు సంఘ సెక్రటరీ వెంకటరావు ఆధ్వర్యంలో ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో రెడ్డి అప్పలనాయుడు సమక్షంలో సోమవారం జనసేన పార్టీలో చేరారు. వారికి రెడ్డి అప్పలనాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగవంశ సంక్షేమ సంఘాల నాయకులు కె.ప్రసాద్, బాలకృష్ణ, కె.సుబ్బు తదితరులు పార్టీలో చేరారు.

నేరాలు - ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న కారు
భర్త మృతి, భార్యకు గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు ఢీకొనడంతో భర్త మృతి చెందగా భార్య తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటన జాతీయ రహదారి బాదంపూడి వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొమ్మిడి గ్రామానికి చెందిన యర్రా పెద్దిరాజు (60) ఆయన భార్య నాగమణితో కలిసి టివిఎస్ మోపెడ్ బైక్‌పై ఉంగుటూరు వెళ్లారు. అక్కడ నుంచి సొంతూరు బొమ్మిడి బయలుదేరారు. ఈ క్రమంలో బాదంపూడి వైజంక్షన్ దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ వెళ్లే కారు వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన భార్యాభర్తలిద్దరిని స్థానికులు అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పెద్దిరాజు మృతి చెందారు. నాగమణి చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రమణక్కపేటలో బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - ముసునూరు

తమ కుమార్తె కనిపించడంలేదని తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేసిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రమణక్కపేట దళితవాడకు చెందిన బాలిక నూజివీడులోని సాంఘిక గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్ చదువుతోంది. ఈ క్రమంలో బాలిక మూడు రోజుల క్రితం ఇంటి నుంచి కనిపించకుండాపోయింది. బాలిక తల్లిదండ్రులు తమ బంధువుల ఇళ్ల వద్ద, తెలిసిన చోట్ల వెతికినా బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో వారు ఈ నెల 13వ తేదీ సాయంత్రం ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై తమ అనుమానం ఉందని బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు సోమవారం ఉదయం ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అయినా బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

కలుపు మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కలుపు మందు తాగిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలోని తెడ్లంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన పిన్నిబోయిన సుబ్బారావు రెండో కుమారుడు పృథ్వి గత రెండేళ్లుగా స్థానికంగా ఉన్న డ్రైవింగ్ స్కూల్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గత రెండు నెలలుగా తండ్రిని స్పోర్ట్స్ బైక్ కొనమని అడుగుతుండగా అప్పులు ఉన్నాయని, తీరాక కొంటానని చెబుతుండడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఈనెల 12న రాత్రి 7:30 నిమిషాల సమయంలో ఇంటి వద్ద ఉన్న కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని కుటుంబసభ్యులు చింతలపూడి ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎం.జయరాజు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ప్రజాశక్తి - కుక్కునూరు

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని అతని వద్ద నుంచి సారాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు కుక్కునూరు మండల పరిధిలోని పెదరావిగూడెం గ్రామంలో ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు చేశారు. ఈ దాడిలో గ్రామంలో నాటుసారా అమ్ముతున్న ఆ గ్రామానికి చెందిన మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆ మహిళకు నాటుసారా సరఫరా చేసిన వేలేరు గ్రామానికి చెందిన ఎన్.సురేష్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సూరి భగవంతం స్మారక కేంద్రం ఏర్పాటుకు కృషి

జయంతి వేడుకలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి
ఆగిరిపల్లి వేద పాఠశాలలో విగ్రహావిష్కరణ



సూరి భగవంతం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

భారత రక్షణ, క్షిపణి రంగానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన వ్యక్తి డాక్టర్ సూరి భగవంతం అని, అటువంటి వ్యక్తి మన ప్రాంతానికి చెందిన వారు కావడం మనకెంతో గర్వకారణమని, ఆయన స్మారక కేంద్రాన్ని నూజివీడులో పెద్ద ఎత్తున ఏర్పాటు చేయటానికి కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. 1961లో తొమ్మిదేళ్ల పాటు కేంద్ర రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పనిచేసిన ఆగిరిపల్లికి చెందిన డాక్టర్ సూరి భగవంతం 115వ జయంతిని పురస్కరించుకుని ఆగిరిపల్లి వేద పాఠశాలలో ఆయన విగ్రహాన్ని సోమవారం అవనిగడ్డ ఎంఎల్ఎ మండలి బుద్ధ ప్రసాద్, డిఆర్‌డిఒ పూర్వపు ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డిలతో కలిసి మంత్రి పార్థసారథి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సూరి భగవంతం నోబుల్ గ్రహీత డాక్టర్ సివి.రామన్ ప్రియ శిష్యులని, బెంగుళూరులోని టాటా ఏరోస్పేస్ రక్షణ సంస్థకు డాక్టర్ సివి.రామన్ అనంతరం సూరి భగవంతం డైరెక్టర్ అయ్యారని చెప్పారు. నాగాయలంకకు రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయటంలో డాక్టర్ సతీష్‌రెడ్డి పాత్ర ప్రధానమైందన్నారు. డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ రక్షణ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో ముందు వరుసలో నిలబెట్టిన ఘనత డాక్టర్ సూరి భగవంతంకు దక్కుతుందన్నారు. అనంతరం సూరి భగవంతం జీవిత చరిత్రపై ప్రచురించిన వైజ్ఞానిక క్రాంతి కిరణం బ్రోచర్‌ను మంత్రి పార్థసారథి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూరి భగవంతం ఫౌండేషన్ ఫౌండర్, డైరెక్టర్ ఎస్‌బి.రామ్, నేషనల్ బుక్ ట్రస్టు సభ్యులు జి.వల్లీశ్వర్, ఆర్‌డిఒ వాణి, పిఆర్‌ఇ బాపురెడ్డి, వేద పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు శలాక రఘునాథశర్మ, సూరి శర్మ, తహశీల్దార్ పిఎస్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **NUKALA VIKRAM**, S/o BHASKARA RAO, Previously called NOOKALA VIKRAM date of birth 01-01-1985 resident of D.No. 11-154, Penumadham, poduru mandal, west godavari andrapradesh, have changed my surname from **NOOKALA VIKRAM** to **NUKALA VIKRAM.** (Hence forth i will be known as nukala vikram...

ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా నెరవేరుస్తున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరు 19వ డివిజన్‌లోని కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ఉపకేంద్రం ద్వారా 5,600 ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన పలువురు మహిళలు తమ సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకురాగా వాటన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీల్లో భాగంగా కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో సబ్ స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. పెరిగిన ప్రజా అవసరాలతో పాటు విద్యుత్ వినియోగాన్ని, లో ఓల్టేజీ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దశలవారీగా పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. వచ్చే మార్చి నాటికి టిడ్కో గృహాలు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఇందులో భాగంగానే అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఎస్ఇ సాల్మన్‌రాజు, ఇఇ శశిధర్, ఇఇ ఆపరేషన్స్ కెఎం అంబేద్కర్, ఎడిఇ శ్రీనివాస్, ఎఇ రాంబాబు, టిడిపి డివిజన్ ఇన్‌ఛార్జి పైడి వెంకట్రావు, కార్పొరేటర్ యర్రంశెట్టి నాగబాబు, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ప్రొఫెసర్ నాగసాయిబాబా మృతికి సంతాపం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ గోకరకొండ నాగసాయిబాబా మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు, ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవాధ్యక్షులు సబ్బి కనకారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. మండలంలోని బొర్రంపాలెంలో ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ నివాసం వద్ద టివిఎస్.రాజు విలేకర్లతో మాట్లాడుతూ చక్రాల కుర్చీలో కూర్చుని తన ఆలోచనతో అభ్యుదయ సిద్ధాంతాలతో యావత్ దేశాన్ని అధ్యయనం చేసిన అభ్యుదయ వాది ప్రొఫెసర్ సాయిబాబా అని అన్నారు. తనకున్న విజ్ఞానంతో అన్యాయాన్ని ఛేదించి పేద ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. సాయిబాబా ప్రొఫెసర్‌గా సేవలందిస్తూ సామాజిక సేవా దృక్పథంతో ఎస్‌సి, బిసి, ఎస్‌టి మైనార్టీకి చెందిన వారి హక్కుల సాధన కోసం విశేషంగా కృషి చేసిన ఆయనపై రాక్షస ప్రభుత్వాలు అక్రమ కేసులు పెట్టి హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. జైల్లో అనారోగ్యానికి గురైన ఆయనకు కనీస వైద్య సహాయం అందించకపోవడంతోనే తీవ్ర అనారోగ్యంతో సాయిబాబా మృతి చెందారని, ఆయన మృతికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని అన్నారు. సాయిబాబా మృతికి ఎపి జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు, పౌరాణిక రంగస్థల కళాకారులు తోట లక్ష్మీనారాయణ, తోట సత్యనారాయణ, కోలాట కళాకారులు బొందలపాటి పద్మావతి, సిరిగినీటి జగదీశ్వరి, తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ సాయిరాజు అన్నారు. పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజినితో కలిసి ఓటు హక్కు వినియోగించడంపై సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ సాయిరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతిఒక్కరూ, ఓటు నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలని చెప్పారు. ప్రతి ఒక్క మనిషికి రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు ఒక ఆయుధమని, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా, ఓటును పారదర్శకంగా సద్వినియోగం చేసుకోవాలని, ఓటు విలువ గురించి, ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిందని, తహశీల్దార్ సాయిరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది, విఆర్ఒలు పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయం చేయాలి : సిపిఐ

ఏలూరు:విజయవాడ పరిసర ప్రాంత వరద బాధితులకు న్యాయం చేయాలని, వరద ఖర్చుల అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, ఐఎఫ్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ విజయవాడను ముంచెత్తిన వరదల సందర్భంగా ప్రభుత్వం చెబుతున్న వరద ఖర్చులు చూస్తే తారాస్థాయిలో జరిగినట్లు అర్థమవుతుందన్నారు. వరద పరిహారాలు ఇచ్చేటప్పుడు బాధిత కుటుంబాల సంఖ్య వేలలో చూపించారని, అదే వరద సందర్భంగా ప్రభుత్వం చేసిన ఖర్చులు కేవలం లక్షల లోపు కుటుంబాలకు అందిస్తే వరద సందర్భంగా కోటి మందికి భోజనాలకు రూ.368 కోట్లు ఖర్చు పెట్టినట్లు లెక్కలు చెప్పారన్నారు. మరి వరద కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం లక్ష లోపు కుటుంబాలే ఎందుకు నమోదు చేశారని ప్రశ్నించారు. మిగిలిన లక్షన్నర కుటుంబాలు ఏమైపోయాయన్నారు. దాతలు అందించిన రూ.500 కోట్లు పక్కదారి పట్టించారన్నారు. ఖర్చుల విషయాలపై హైకోర్టు న్యాయ మూర్తులతో విచారణ జరిపించి వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నూజివీడు టౌన్ :నూజివీడు పట్టణంలో ఉన్న ఎంప్లాయిస్ కాలనీలోని జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) కార్యాలయ ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జీవిత బీమా సంస్థ కార్యాలయాల్లో అగ్నిమాపక పరికరాల పరిశీలన కొనసాగించారు. ఇందులో భాగంగా నూజివీడు పట్టణంలో అగ్ని ప్రమాద నివారణ పరికరాలను పరిశీలించిన ప్రతినిధి కార్యాలయ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మంటలు చెలరేగినప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టాలో సోదాహరణంగా వివరించారు. ప్రతి సంవత్సరం కార్యాలయాల వద్ద అగ్నిమాపక పరికరాలను పరిశీలించి, ప్రమాద నివారణ చర్యల పట్ల సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

పలుచోట్ల ఘనంగా 'పల్లె పండుగ'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో పల్లె పండుగ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా పనులకు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు శంకుస్థాపన చేశారు. ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, జనసేన జిల్లా కార్యదర్శి రవికుమార్, ఇతర కూటమి నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పన ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆకాంక్షించారు. కన్నాపురం పంచాయతీలో నూతన సచివాలయ భవనాన్ని ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ప్రారంభించారు.

పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలో పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంఎల్ఎ బాలరాజు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు.

కామవరపుకోట : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమలకు సోమవారం చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ శంకుస్థాపన చేశారు. మండలంలోని తడికలపూడి, వీరిశెట్టిగూడెం, ఆడమిల్లి, తాడిచర్ల, గుంటుపల్లి, ఉప్పలపాడు, రావికంపాడు గ్రామ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రూ.5.19 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇంత పెద్ద స్థాయిలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మురళి, టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, కోనేరు వెంకట సుబ్బారావు, తూతా లక్ష్మణరావు, జుజ్జూరి బాబ్జి, జనసేన మండలాధ్యక్షులు షేక్ వలి, బొబ్బిలి వీరబాబు, సిరిగినేటి వెంకన్నబాబు పాల్గొన్నారు.

ఉంగుటూరు : పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పించి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులతో అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందని ఎంఎల్ఎ ధర్మరాజు అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పలు గ్రామాల్లో ఎంఎల్ఎ శంకుస్థాపన పనులను చేపట్టారు. పెద్ద వెల్లమిల్లిలో రూ.పది లక్షలు, బాదంపూడిలో రూ.పది లక్షలు, చేబ్రోలులో రూ.15 లక్షలు, గోపీనాథపట్నంలో రూ.15 లక్షలు, రామచంద్రపురంలో రూ.నాలుగు లక్షలు, ఉప్పాకపాడులో రూ 12.50 లక్షలు మొత్తం రూ.66.50 లక్షల పనులకు ఎంఎల్ఎ ధర్మరాజు పనులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, సర్పంచులు రాంధే లక్ష్మీసునీత, విష్ణుమూర్తి, కంకట పద్మలీల, ఎంపిటిసి సభ్యులు, అధికారులు, జనసేన, టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన

ముసునూరు :మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిధిలోని అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి, లోపూడి, బాసవరపాడు, చెక్కపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. చెక్కపల్లిలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 9/2024

Between:
Plaintiff: Sala Jaya Sankar
AND
Defendant: Battu Indu
TO: Battu Indu, D/o. William Cary Babu, R/o. D.No.3-38/2, 1st Floor, Yalla Vani Garuvu Panchayat, Gaggiparru Road, Palakol Rural, W.G.Dist.

పై నెంబరు దావాలో మీకు ఎన్నిసార్లు దావా సమన్లు కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున వాది పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు అమలు జరిపించమని కోరుతూ పిటీషను దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు మీకు పంపమని ఉత్తర్వులు జారీ చేసినందున పై నంబరు దావాలో మీ హాజరు నిమిత్తం **ది.24-10-2024 సం॥రం తేదీకి వాయిదా వేసి ఉన్నారు.** కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా కాని హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు దావా ముందు గ్రంధము జరుపబడును.

జక్కంశెట్టి వెంకటేశ్వరరావు
కోట చంటియ్య
పాలకొల్లు, న్యాయవాదులు, పాలకొల్లు.
14-10-24. సెల్: 9705547788

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

ఓ.ఎస్.నెం. 121/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం.
...వాది
అండ్
వెలగన నాగమణి అండ్ అనదర్
...ప్రతివాది /ప్రతివాదులు
సమన్స్ టు
డి-1: వెలగన నాగమణి, భర్త: సత్యనారాయణ, డో.నెం.4-402, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
డి-2: వేముల అశ్వని కుమార్, తండ్రి: భాస్కరరావు, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 16-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం.
14-10-24. ఫోన్: 08814 274628

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర డివిజన్) వారి కోర్టులో

ఇ.పి.నెం.33/2015 ఇన్ ఓ.ఎస్.నెం.108/2002

డి. హెచ్.ఆర్: ఈదన దామోదర రావు
VS
జె.డి.ఆర్: గుత్తుల సహదేవుడు (డైడ్) వగైరా

డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు గాను జె.డి.ఆర్స్ తాలూక ఈ దిగువ తెలియపర్చిన ఆస్థిని **ది.01-11-2024వ సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును.** కావలసిన వారు వచ్చి పాడుకొనవచ్చును.

SCHEDULE

West Godavari District, Narasapur Mandal, Narsapur Sub-Registrar.
Item No.2: Pasaladeevi Village, Terraced Building bearing D.No.10-8/1 in R.S.No.0181/5 in an extent of Ac.0-27 Cents within the following boundaries:
East: Narasapuram - Perupalem Road.
South: House belongs to Mallela Pentamma and Others. ***West:*** Lands belongs to Mallela Ranga Rao and Others.
North: Lands belongs to Kadali Surya Rao.
With all easementary rights.

D.H.R. Value : Rs.75,000/-
Amin Value : Rs.2,00,000/-

చల్లా దానయ్య నాయుడు
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం.
10-10-24. సెల్: 9441086919

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

ఓ.ఎస్.నెం. 323/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం.
...వాది
అండ్
బోళ్ళ సుబ్రహ్మణ్యం అండ్ అనదర్
...ప్రతివాది /ప్రతివాదులు
సమన్స్ టు
డి-1: బోళ్ళ సుబ్రహ్మణ్యం, తండ్రి: యాదవరావు, డో.నెం.3-75, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
డి-2: వేముల బాలఫణి, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 16-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం.
14-10-24. ఫోన్: 08814 274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

ఓ.ఎస్.నెం. 311/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం.
...వాది
అండ్
ఆరేపల్లి సుజాత అండ్ అనదర్
...ప్రతివాది /ప్రతివాదులు
సమన్స్ టు
డి-1: ఆరేపల్లి సుజాత, భర్త: రంగారావు, డో.నెం.3-11/7, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
డి-2: వేముల శ్రీనివాస్, తండ్రి: భాస్కరరావు, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 16-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం.
14-10-24. ఫోన్: 08814 274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

ఓ.ఎస్.నెం. 135/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం.
...వాది
అండ్
పితాని గాంధి అండ్ అనదర్
...ప్రతివాది /ప్రతివాదులు
సమన్స్ టు
డి-1: పితాని గాంధి, తండ్రిం వెంకన్న, డో.నెం.2-125, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
డి-2: వేముల రాము, తండ్రి: మోహనరావు, డో.నెం.4-120, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 16-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం.
14-10-24. ఫోన్: 08814 274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

ఓ.ఎస్.నెం. 315/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం.
...వాది
అండ్
ఆరేపల్లి సురేష్ అండ్ అనదర్
...ప్రతివాది /ప్రతివాదులు
సమన్స్ టు
డి-1: ఆరేపల్లి సురేష్, తండ్రి: ప్రసాదరావు, డో.నెం.2-38, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
డి-2: కట్టా మురళ, తండ్రి: వెంకటేశ్వరరావు, డో.నెం.5-104, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడి (జూనియర్ డివిజన్) కమ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 16-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం.
14-10-24. ఫోన్: 08814 274628